క్లుప్తంగా

విద్యార్థులకు పూర్తి స్థాయిలో నోట్ పుస్తకాలు



ఎమ్మార్సీకి చేరిన నోట్ పుస్తకాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎట్టకేలకు పూర్తి స్థాయిలో నోట్ పుస్తకాలు సమకూర్చారు. మండలంలోని 6 జెడ్పీహెచ్ఎస్‌లు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6 నుంచి 10 వరగతి వరకు చదువుకునే విద్యార్థులందరికి మూడు విడతల్లో నోట్ పుస్తకాలు వచ్చాయి. మొత్తం సుమారు 8 వేల వరకు నోట్‌పుస్తకాలు రాగా ఆయా పాఠశాలలకు వీటిని పంపిణీ చేస్తున్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు పూర్తి స్థాయిలో నోట్‌పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ బాలునాయక్ తెలిపారు.

కళ్ల కలకకు ఉచితంగా ఐడ్రాప్స్ పంపిణీ చేయాలి

అర్వపల్లి : కళ్ల కలకలతో గ్రామాల్లో ప్రజలు, విద్యాసంస్థల్లో పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారని, వైద్య ఆరోగ్యశాఖ వెంటనే ఉచితంగా ఐడ్రాప్స్‌ను పంపిణీ చేయాలని ఎంసీపీఐయూ డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళ్ల కలక అంటువ్యాధి కావడంతో అనేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రతి ఇంటింటికీ, విద్యాసంస్థల్లో పిల్లలందరికీ ఐడ్రాప్స్ అందించాలని కోరారు.

దివ్యాంగులందరికీ అవకాశం కల్పించాలి

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంలో దివ్యాంగులందరికీ అవకాశం కల్పించాలని వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జహీర్‌బాబా శనివారం ఒక ప్రకటనలో కోరారు. పథకంలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వివాహం కాని పురుష దివ్యాంగులకు, 40 శాతం అంగవైకల్యం గల సదరం సర్టిఫికెట్ ఉన్న వారందరికీ ఈ పథకంలో అవకాశం కల్పించాలని కోరారు.

గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలి

నూతనకల్ : గ్రామ సభల ద్వారానే వివిధ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీసీ కులాల్లోని వృత్తిదారులకు వ్యక్తిగతంగా రూ.లక్ష రుణం, దళితబంధు, గృహలక్ష్మి వంటి సంక్షేమ పథకాల్లో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యానాల వెంకట్‌రెడ్డి, ఉప్పలయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

నాగారం : రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ బత్తుల రవి అన్నారు. శనివారం మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేవీఓ వై.నాగరాజు, ఎల్ఎస్ఏ మురళి, రైతులు ఉప్పుల లింగయ్య, గుండబోయిన సంతోష్, దాసరి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నాగులపహాడ్ గ్రామానికి చెందిన పెరపంగి వెంకటయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. అతడి మృతదేహానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండలి పిచ్చయ్య, నారాయణ ప్రవీణ్‌రెడ్డి, ఒగ్గు దేవయ్య, పాల్గొన్నారు.

మృతుడికి నివాళి

సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన పేర్ల దేవలింగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం మృతుడి కుటుంబాన్ని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావు పరామర్శించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోకల రాములు, సలిగంటి వీరేంద్ర పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకానికి 2194 దరఖాస్తులు

నడిగూడెం : మండలంలో గృహలక్ష్మి పథకానికి 2194 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ టి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

1827 దరఖాస్తులు

మునగాల : మండల వ్యాప్తంగా గృహలక్ష్మి పథకానికి 1827 దరఖాస్తులు అందాయని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాధారెడ్డి శనివారం తెలిపారు. కమ్యూనిటీ పరంగా ఎస్సీ వర్గాల నుంచి 577, ఎస్టీ 187, బీసీ 765, మైనార్టీ 49, ఇతరులు 234, దివ్యాంగుల నుంచి 15 దరఖాస్తులు అందాయన్నారు.

పంచాయతీలకు పక్కా భవనాలు

- చివ్వెంల మండలంలో 15 గ్రామాలకు నిధులు మంజూరు
- ఉపాధిహామీ పథకం కింద ఒక్కొక్క భవనానికి రూ.20 లక్షలు



పిల్లలజెగ్గుతండాలో అద్దెభవనంలో నడుస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయం



మోదిన్‌పురం గ్రామంలో నిర్మిస్తున్న నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం

చివ్వెంల : గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలకు సరైన భవనాలు లేక పాలన కొనసాగించడంలో, సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇప్పటివరకు అద్దెభవనాల్లో, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన గదుల్లో పంచాయతీ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. దీంతో సర్పంచ్‌లు పక్కా భవనాలు కావాలని ప్రభుత్వానికి అనేకమార్లు విన్నవించారు. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జీపీ భవనాలు నిర్మించేందుకు నిర్ణయించింది. ఒక్కో భవనం కోసం రూ.20 లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. చివ్వెంల మండలంలో 31 గ్రామాలకు గాను 15 గ్రామాల్లో పక్కా భవనాల కోసం నిధులు మంజూరు చేశారు.

నిధులు కేటాయింపు..

చివ్వెంల మండల పరిధిలో 15 గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించేందుకు ఒక్కో భవనానికి రూ.20 లక్షల నిధులు కేటాయించారు. నిధులు కేటాయించిన గ్రామాల్లో చివ్వెంల, జగనాతండా, రాజుతండా, అక్కలదేవిగూడెం, మోదిన్‌పురం, ఉండ్రుగొండ, బి.చందుపట్ల, భీమ్లాతండా, ఐలాపురం, ఎర్రసూర్యాతండా ఉన్నాయి. అదే విధంగా ఎస్‌టీఎఫ్ నిధుల కింద మండల పరిధిలోని పులితండా, మున్యానాయక్‌తండా, పిల్లలజెగ్గుతండా, లక్ష్మణ్ నాయక్ తండా గ్రామాల్లో భవనాల నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయి. నూతన భవనాల నిర్మాణాల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల జీపీ సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

పూర్తి సేవలు అందించేందుకే..



గ్రామాల్లో పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. ఉపాధిహామీ ద్వారా మంజూరైన నిధులతో విశాలంగా ఉండేలా భవనాలు నిర్మించుకోవాలి. ఎంపికైన గ్రామాల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి. నాణ్యత పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలి.

– టి.గోపి, ఎంపీఓ, చివ్వెంల

నిర్మాణాలు చేపడుతున్నాం

మండలంలో 15 గ్రామాలకు పక్కా భవనాల నిర్మాణాల కోసం ఉపాధిహామీ, ఎస్‌టీఎఫ్ ద్వారా నిధులు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లో నిర్మాణ పనులు చేపడుతున్నాం. ఇప్పటికే మోదిన్‌పురం గ్రామంలో భవన నిర్మాణం పూర్తయింది. మిగతా భవనాలు కూడా పూర్తి చేస్తాం.

– ధరావత్ లింగానాయక్, పీఆర్ ఏఈ, చివ్వెంల

అభివృద్ధితో లక్షల మందికి ఉపాధి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎస్ ఫౌండేషన్ చైర్మన్ గుంటకండ్ల సునీతజగదీష్‌రెడ్డి

సూర్యాపేట : ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధితో లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఎస్ ఫౌండేషన్ చైర్మన్ గుంటకండ్ల సునీతజగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 22, 36వ వార్డుల్లో మహిళలకు కోలాటం చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మెడికల్ కళాశాల, రెండు మినీ ట్యాంక్‌బండ్లు, మహాప్రస్థానంతో అభివృద్ధి సందడి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, బీఆర్ఎస్ నాయకులు గండూరి ప్రకాష్, నాయకులు రాచకొండ కృష్ణ, గుడిసె శేఖర్, గోనె అశోక్, ఆయా వార్డుల మహిళ నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఎస్‌టీఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం



ఎస్‌టీఎఫ్‌ఐ జెండా ఎగురవేస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్‌ఐ) 24వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో శనివారం ఎస్‌టీఎఫ్‌ఐ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం – 2020, నూతన పెన్షన్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్ కుమార్, జిల్లా కోశాధికారి జి. వెంకటయ్య, ఎం.వెంకన్న, బి. పాపిరెడ్డి, అనిల్ కుమార్, సీహెచ్ రమేష్, డి.లాలు, డి. శ్రీనివాసచారి, వివిధ మండలాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న ముఖ్యమంత్రి



14వ వార్డులో యూత్ డిక్లరేషన్‌ను వివరిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, నాయకులు

భానుపురి : ఎన్నికల ముందు ఓట్ల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధుల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 14వ వార్డులో పార్టీ నాయకులు రంగారెడ్డి, నరేందర్‌ల ఆధ్వర్యంలో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ముఖ్యమంత్రి మాయమాటలను నమ్మలేని ప్రజలు కాంగ్రెస్ పార్టీని సాదరంగా ఆహ్వానిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తథ్యమన్నారు. సూర్యాపేటలో మంత్రి జగదీష్ రెడ్డి, ఆయన తాబేదారులు తప్పా ఎవరూ అభివృద్ధి చెందలేదన్నారు. అనంతరం పార్టీ నాయకుడు నామా ప్రవీణ్ ఆధ్వర్యంలో వార్డుకు చెందిన దాసరి విజయలక్ష్మీతో పాటు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి రాజా, గోదల రంగారెడ్డి, నేరేళ్ల మధు, చిలుముల గోపాల్‌రెడ్డి, రాచకొండ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేసే వరకూ పోరాటం



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న సీపీఎస్ ఉద్యోగులు

సూర్యాపేటటౌన్ : సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని సాధించే వరకూ టీఎస్ సీపీఎస్‌ఈయూ ఉద్యమిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ అన్నారు. టీఎస్ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన సంకల్పయాత్ర ముగింపు సభకు జిల్లా కేంద్రం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం సాధించేందుకు ఉద్యోగ ఉపాధ్యాయులంతా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి గుయ్యాని ప్రసాద్, నరసింహ, నారాయణ, సతీశ్ కుమార్, పల్లి వీరారెడ్డి, ప్రసాద్, నేతికండ్ల విజయ్, శ్యామ్ సుందర్ రెడ్డి, సాలయ్య, వెంకన్న, ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి, మల్లికార్జున్, నాగేశ్వర్ రావు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఓటు నమోదు ప్రక్రియ

- ఇప్పటికే పూర్తయిన ఓటర్ జాబితా సవరణ
- జాజిరెడ్డిగూడెం మండలంలో 22,222 మంది ఓటర్లు
- ఈ నెల 26, 27, వచ్చేనెల 4, 5 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు



ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న బూత్ లెవల్ అధికారి (ఫైల్)

అర్వపల్లి : సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని మండలంలో పూర్తిచేశారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి మార్పులు, చేర్పులు సవరణలు, కొత్త ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటర్ నమోదుకు ఫారం -6, తొలగింపులకు ఫారం-7, సవరణలకు ఫారం-8లో దరఖాస్తు చేయగా బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి సవరణలు జరిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా కోసం అంతా సిద్ధం చేసి ఉంచారు. అలాగే రెండు చోట్ల ఉన్న, మరణించిన వారి ఓట్లను జాబితాలో నుంచి తొలగించారు. ఈ ఏడాది కొత్తగా 18 ఏళ్లు నిండిన వారు 530 మంది దరఖాస్తు చేసుకోగా వారందరికి ఓటు హక్కు కల్పించారు. కాగా ఈ నెల 26, 27, సెప్టెంబర్ 3, 4 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో..

జాజిరెడ్డిగూడెం మండలంలో 31 పోలింగ్ కేంద్రాలుండగా 22,222 మంది ఓటర్లు ఉన్నారు. కాగా 1 అక్టోబర్ 2023 నాటికి 18 ఏళ్లు నిండే వారు సైతం తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఫారంబీ-6 ఆధార్‌కార్డుకు ఓటర్ కార్డును లింక్ చేసుకునేందుకు ఉపయోగించుకోవాలి. ఓటర్ జాబితాలో పేరు ఉందా లేదా అనే విషయాన్ని ఓటర్లు పరిశీలించుకోవాలి. మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ అధికారులు పరిశీలించి తగిన వసతులు కల్పించే పనిలో నిమగ్నమయ్యారు.

ఓటు హక్కు పొందాను



18ఏళ్లు నిండటంతో కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేయగా ఓటు హక్కు కల్పించారు. ఈసారి నుంచి ఏడాదికి 4 సార్లు ఓటు నమోదుకు అవకాశం కల్పించడం హర్షణీయం. ఓటే వజ్రాయుధం అయినందున 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి.

– నల్లగుంట్ల సాయికీర్తన, విద్యార్థిని, అర్వపల్లి

అక్టోబర్ నాటికి 18ఏళ్లు నిండితే ఓటు హక్కు



ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని మండలంలో పూర్తి చేశాం. ఈఏడాది అక్టోబర్ నాటికి 18 ఏళ్లు నిండనున్న వారు సైతం ఓటరు నమోదుకు ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలి. 18 ఏళ్లు నిండగానే కొత్త ఓటరుగా నమోదు చేస్తాం. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి మార్పులు, చేర్పులు చేపట్టారు. ఈసారి కొత్తగా 530 మంది ఓటు కోసం దరఖాస్తు చేసుకోగా ఓటు హక్కు కల్పించాం.

– జక్కర్తి శ్రీనివాసులు, తహసీల్దార్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్

మునగాల : గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెనుయేలు వర్షిప్ సెంటర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జె.జె.సామ్యూల్ కోరారు. శనివారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో తమ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో ఆరోగ్యశ్రీ ఆస్పత్రి ప్రముఖ వైద్యుడు శశిసుందర్ ఆధ్వర్యంలో సీనియర్ ఆర్ఎంపీ వైద్యుల సహకారంతో 215 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెనుయేలు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జి.ప్రభాకర్, ఎం.రాజేష్, జె.ప్రవీణ్, ఇ.ఉదయ్, ఎల్.లాజర్, జి.ఓబద్యా, కె.రాజు, తబిత, వనజ, రాణి, సుగుణమ్మ, దానియేలు, సీనియర్ ఆర్ఎంపీ వైద్యులు ఏ.భిక్షపతి, పి.పృథ్వీ, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



తిరుమలగిరిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు



చివ్వెంలలో..



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో..



తుంగతుర్తిలో..

తిరుమలగిరి : వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని శనివారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, మాధవి, వెంకటమ్మ, యశోద, రజిత తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాలకు వినతి

చివ్వెంల : తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సెకండ్ ఏఎన్ఎంలు శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 15ఏళ్లుగా చాలిచాలని జీతాలతో ఉద్యోగం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలు వెంకటరమణ, మమత, ఉష, నిరుపమా, జ్యోత్స్న, సునీత పాల్గొన్నారు.

అర్వపల్లి : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని చేస్తున్న శాంతియుత నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం మండల ఏఎన్ఎంలు జాజిరెడ్డిగూడెంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు విజయశాంతి, శకుంతల, నాగరాణి, ఊర్మిళ, గిరిజ, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంల నిరసన

తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండంలోని రెండో ఏఎన్ఎంలు శనివారం కూడా అర్వపల్లి పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల ముందు కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు విజయశాంతి, నాగరాణి, శకుంతల, ఊర్మిళ, గిరిజ, శ్వేత పాల్గొన్నారు.

తుంగతుర్తి : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని చేస్తున్న శాంతియుత నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం మండల ఏఎన్ఎంలు తుంగతుర్తిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు భారతి, కమల, రజిత, తదితరులు పాల్గొన్నారు.

నెమ్మికల్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతి..

ఆత్మకూర్ (ఎస్) : తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రెండవ ఏఎన్ఎంలు శనివారం మండల పరిధిలోని నెమ్మికల్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సల్వాది నిర్మల, అన్నపూర్ణ, రాములమ్మ, రేణుక, ధనమ్మ, భవాని, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న వడ్డెపల్లి రవి

తుంగతుర్తి : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు వడ్డెపల్లి రవి అన్నారు. ఈ నెల 14న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో అర్థం కాకుండా ఉందని, రుద్రమ్మ చెరువును రిజర్వాయర్ చేస్తామని ఇంతవరకు చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజ్జ నరేందర్, రమేష్, జాని, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పసికందు మృతికి కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు వడ్డెపల్లి రవి అన్నారు. మండల కేంద్రంలోని ఆస్పత్రిలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ఇటీవల పసి కందు మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్, జాని, వెంకన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమాల రథసారథి ఏఐఎస్ఎఫ్



మాట్లాడుతున్న బొమ్మగాని శ్రీనివాస్

సూర్యాపేటటౌన్ : విద్యార్థి ఉద్యమాల రథసారథి ఏఐఎస్ఎఫ్ అని మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం సూర్యాపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అంకిత భావంతో పోరాటాలు నిర్వహించే ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్, నాయకులు కనపర్తి యశ్వంత్, బానోతు యాకన్న, కాసర్ల వంశీ, కొరవి ప్రవీణ్ పాల్గొన్నారు.

నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

చివ్వెంల : సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయ్ గోదాముల్లో పని చేసే హమాలీలకు గుర్తింపు లేకుండా పోతుందన్నారు. వారికి విశ్రాంత భవన నిర్మాణాలు చేపట్టాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రంగనాథన్ కృషి ఆదర్శనీయం

కోదాడఅర్బన్ : వయోజనుల విద్య కోసం గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ చేసిన కృషి ఆదర్శనీయమని కోదాడ శాఖ గ్రంథాలయ చైర్మన్ ఎస్కే రహీం అన్నారు. ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా శనివారం కోదాడలోని శాఖ గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోదాడకు చెందిన జారా ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను ఆ సంస్థ కోఆర్డినేటర్ షేక్ జాహీర్‌తో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సభ్యులు బత్తుల ఉపేందర్, నర్సింహారావు, శేఖర్, ఆరీఫ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

చిలుకూరు : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం (నేడు) నిర్వహించబోయే శ్రీశ్రీ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని జైగౌడ్ సంఘం నాయకులు కోరారు. శనివారం మండలంలోని బేతవోలులో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జైగౌడ్ సంఘం జిల్లా, మండల నాయకులు మండవ సైదులు, బత్తిని రాములుగౌడ్, బెల్లంకొండ వీరయ్య గౌడ్ బెల్లంకొండ లక్ష్మయ్య, బాబుగౌడ్, అంజిబాబు, కాశిగౌడ్, రాములుగౌడ్ పాల్గొన్నారు.

17న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సంఘాల సదస్సు

మునగాల : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు పార్లమెంటు ద్వారా చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు చివరి వారంలో హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయడానికి ఈనెల 17న సూర్యాపేటలో నిర్వహించబోయే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఎంఎస్పీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి రాజు మాదిగ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్ లంజేపల్లి శ్రీను మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో మాదిగ, మాదిగ ఉప కులాల యువత, విద్యార్థులు, మహిళలు, మాదిగపెద్దలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు లంజేపల్లి అంజి, కిన్నెర రాజు, రవి, నవీన్ పాల్గొన్నారు.

బోనాల పండుగ



బోనాలతో వెళ్తున్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాలు చేసి ర్యాలీగా స్థానిక దేవాలయం వరకు వెళ్లారు. విద్యార్థులు పోతరాజు వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27న కోదాడలో బోనాలు

కోదాడఅర్బన్ : కోదాడలో 27న (ఆదివారం) ముత్యాలమ్మ (బోనాల) పండుగ నిర్వహించనున్నట్లు ముత్యాలమ్మ దేవాలయ కమిటీ, రైతు కమిటీ, పట్టణ పెద్దలు తెలిపారు. శనివారం కోదాడలోని ముత్యాలమ్మ దేవాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు వట్టివేళ్ల రవీందర్‌రెడ్డి, సభ్యులు సైదయ్య, గంధం పాండు, వేముల రామయ్య, కోట వెంకటేశ్వర రావు, చిన్న వెంకయ్య, రామారావు, మురళి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ ప్రమాణస్వీకారం

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2023– 24 విద్యా సంవత్సరానికి గాను ఇటీవల ఎన్నికైన పేరెంట్స్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం శనివారం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవి జయలక్ష్మి, నూతన కమిటీ చైర్మన్ జి.మరియమ్మ, వైస్ చైర్మన్ కె.ఉపేందర్, సభ్యులు, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ రేణుక, ఏ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.